క్లుప్తంగా

పేదల సొంతింటి కల సాకారం



ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు, అధికారులు

కలిగిరి: రాష్ట్రంలో ఉచితంగా ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు కట్టించి పేదల ఇంటి కలలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి తెలిపారు. కలిగిరిలోని జగనన్న కాలనీలో 40 గృహాల నిర్మాణాలకు శనివారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి, ఎంపీడీఓ ఆర్‌వీ కళాధర్‌రావు, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర రెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు మోహన్, మనోహర్, ప్రభాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల్లో నాణ్యత ముఖ్యం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఏఈతో మాట్లాడుతున్న తహసీల్దారు

సంగం: ఇళ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి లోపం లేకుండా చూడాలని తహసీల్దార్ నాగరాజు చెప్పారు. మండలంలోని వెంగారెడ్డిపాళెం, పడమటిపాళెం, గాంధీజనసంఘం, వంగల్లు, మర్రిపాడు గ్రామాల్లో జగన్నన ఇళ్ల కాలనీ నిర్మాణాలను శనివారం హౌసింగ్ ఏఈ కరిముల్లాతో కలిసి తహసీల్దారు పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పురోగతిపై చర్చించారు. నిర్మాణాల నాణ్యతను పరిశీలించి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించి పూర్తి చేసే విధంగా అవగాహన కల్పించాలన్నారు. గాంధీజన సంఘంలో జరుగుతున్న ఇంటింటికి రేషన్ పంపిణీని పరిశీలించి సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు వాసుదేవరెడ్డి ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



మాదాల హజరత్తయ్య

అనుమసముద్రంపేట: మండలంలోని చౌటభీమవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత మాదాల హజరత్తయ్య అనారోగ్యంతో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉన్నారు. ఆయన భౌతికకాయానికి జేసీఎస్ కన్వీనర్ పులిమి వెంకట రమేష్‌రెడ్డితో పాటు పలువురు నేతలు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రైతు సేవలకు ప్రాధాన్యం ఇస్తా

- సొసైటీ చైర్మన్ సానా వేణుగోపాల్ రెడ్డి



నూతన చైర్మన్ వేణుగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరులోని సిండికేట్ ఫార్మర్స్ సొసైటీకి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు రైతుల సేవకు ప్రాధాన్యం ఇస్తానని సొసైటీ నూతన చైర్మన్ సానా వేణుగోపాల్ రెడ్డి అన్నారు. సిండికేట్ ఫార్మర్స్ సొసైటీ నూతన కార్యవర్గంతో శనివారం సాయంత్రం బ్యాంకు (సొసైటీ) మేనేజరు శ్రీనివాసులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ సిండికేట్ బ్యాంకు (కెనరాబ్యాంకు) ఆర్థిక సహకారంతో 40 ఏళ్ల క్రితం రైతుల సేవల కోసం సొసైటీ ఏర్పడిందన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సహకారం, ఉన్నతాధికారుల ప్రణాళికలతో సొసైటీని అభివృద్ధి పథంలో నిలబెడతామన్నారు. ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్యలు తదితరులు చైర్మన్‌ను, కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో చల్లా కృష్ణారెడ్డి, సురేష్ యాదవ్, కళ్యాణ్, నోటి వినయ్ కుమార్‌రెడ్డి, కొప్పోలు పెంచల రెడ్డి, తోడేటి మణి, రైతులు పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో గుడి నిర్మాణం

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని పుల్లనీళ్లపల్లి అరుంధతీయకాలనీలో ఉన్న మాతమ్మ తల్లి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, టీటీడీ సహకారంతో చర్యలు తీసుకుంటానని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన నివాసానికి వెళ్లిన జాతర నిర్వాహకులకు జాతర ఖర్చులకు విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో సుబ్బు నాగభూషణం, నాగయ్య, ఆదినారాయణ, బుజ్జమ్మ, వెంకట సుబ్బమ్మ, పెంచలయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

పల్లెదారికి మహర్దశ

దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్డు. అలనా పాలనా లేకపోవడంతో నరకానికి నకలుగా మారింది. మూడు మండలాల పరిధిలో ముప్పై గ్రామాల ప్రజల రాకపోకలు సాగించే రోడ్డు పునర్నిర్మాణంపై గత ప్రభుత్వాలు విస్మరించాయి. విద్య, వ్యాపార, వ్యవసాయ, వాణిజ్య కేంద్రాలకు అనువుగా ఉండే రహదారికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మోక్షం లభించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వనరులతో నిర్మించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. ఆయన మరణానంతరం కేంద్ర రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి రోడ్డు నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడంతో ఎట్టకేలకు మంజూరైంది.

- ప్లాస్టిక్, సిమెంట్, కంకరతో ఆధునిక టెక్నాలజీతో నిర్మాణం
- మూడు మండలాలు 30 గ్రామాలను కలుపుతూ 12 కి.మీ. రోడ్డు
- సుమారు రూ.9 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, బొగ్గేరుపై కల్వర్టు
- త్వరలోనే టెండర్లు పిలిచి, రోడ్డు నిర్మాణానికి శరవేగంగా జరుగుతున్న ప్రక్రియ

ఆత్మకూరురూరల్: గ్రామీణ ప్రజల దశాబ్దాల కల.. త్వరలో సాకారం కాబోతోంది. ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి నల్లగొండ్ల వరకు ఉన్న 12 కి.మీ. రహదారి పునర్నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు వచ్చాయి. సుమారు రూ.9 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డుతో పాటు బొగ్గేరుపై కల్వర్టు నిర్మాణం కూడా చేపట్టనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే మూడు మండలాల్లోని దాదాపు 30 గ్రామాల ప్రజలకు ప్రయాణం సుఖవంతంగా ఉంటుంది.



రామస్వామిపల్లి-బంట్లపల్లి మధ్యలో గుంతలమయమై తీవ్రంగా దెబ్బతిన్న రోడ్డు



వెన్నవాడ-గండ్లవీడు మధ్యలో బొగ్గేరులో ఇసుక రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ఆటోలు, మోటారు సైకిళ్ల వాహనదారులు

ఆత్మకూరు మండలం రామస్వామిపల్లి నుంచి మర్రిపాడు మండలం డీసీపల్లి వద్ద 67వ నంబరు జాతీయ రహదారిని తాకుతూ వెన్నవాడ మీదుగా వింజమూరు మండలం నల్లగొండ్ల వరకు ఉన్న రోడ్డు 30 గ్రామాలు ఉన్నాయి. సుమారు 12 కి.మీ. మేర ఉన్న రహదారి చాలా భాగం ధ్వంసమైంది. రాకపోకలు సాగించేందుకు ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు నిత్యం పడరాని పాట్లు పడుతున్నారు. వెన్నవాడ-గండ్లవీడు మధ్య సుమారు కి.మీ. దూరం బొగ్గేరులో ఇసుక రోడ్డుపై వేసవి కాలంలో అతి కష్టంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఐదు కి.మీ. ప్రయాణంతో జాతీయ రహదారిపైకి చేరగలిగే అవకాశం ఉన్నప్పటికీ వర్షా కాలంలో మరో 12 కి.మీ. దూరం మరో మార్గంలో తిరిగి వెళ్లాల్సి వస్తోంది. దీంతో 12 కి.మీ. ప్రయాణం కాస్త 24 కి.మీ. అవుతోంది.

బొగ్గేరుపై వంతెన దశాబ్దాల కల

ప్రధానంగా రామస్వామిపల్లి-డీసీపల్లి మధ్య 7 కి.మీ. రోడ్డు మరింత దుస్థితికి చేరడంతో వందలాది మంది పొగాకు రైతులు డీసీపల్లి వేలం కేంద్రానికి ట్రాక్టర్ల ద్వారా తమ ఉత్పత్తులు విక్రయించుకోవడానికి అనునిత్యం పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. గండ్లవీడు, బొటికర్లపాడు, యర్రబల్లి, శంఖవరం, పడకండ్ల, కిస్తీపురం, వెన్నవాడ తదితర గ్రామాల ప్రజలు పొగాకుతో పాటు తాము సాగుచేస్తున్న పత్తి, వరి వంటి వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించుకోవడానికి రాకపోకలు సాగించేందుకు బొగ్గేరుపై వంతెన లేక దశాబ్దాలుగా ఇక్కట్లు పడుతున్నారు. దుత్తలూరు, వింజమూరు మండలాల్లోని పలుగ్రామాల ప్రజలు విద్య, వైద్యం అవసరాల కోసం ఆత్మకూరు లేదా నెల్లూరుకు వెళ్లాలంటే నానా అవస్థలు పడి డీసీపల్లి సెంటర్‌లోని జాతీయ రహదారి వద్దకు, లేదా వింజమూరు మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంది.

గౌతమ్‌రెడ్డి ప్రతిపాదనలు బుట్టదాఖలు చేసిన టీడీపీ ప్రభుత్వం

సుమారు 30 గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యపై అప్పటి ఎమ్మెల్యేగా ఉన్న దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి వెన్నవాడ-గండ్లవీడు మధ్య బొగ్గేరుపై కాజ్‌వే నిర్మించడంతో పాటు రామస్వామిపల్లి నుంచి నల్లగొండ్ల వరకు తారురోడ్డు నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఆ మేరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గౌతమ్‌రెడ్డి చేసిన ప్రతిపాదనను అప్పటి టీడీపీ ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. ఆ తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు నిర్మాణానికి ప్రయత్నించారు. కరోనా విపత్తు రావడంతో అభివృద్ధి పనులకు విఘాతం ఏర్పడింది. కరోనా నుంచి పూర్తిగా కోలుకునే సరికి గౌతమ్‌రెడ్డి అకాల మరణం చెందడంతో ఈ సమస్యను ఆయా గ్రామాల ప్రజలు మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి తెచ్చారు. దీంతో ఎమ్మెల్యే సంబంధిత పంచాయతీరాజ్ అధికారులు అంచనాలు తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతుల కోసం నివేదికలు పంపారు. కేంద్ర రక్షణశాఖ సలహాదారు సతీష్‌రెడ్డి సహకారంతో రోడ్డు నిర్మాణానికి అనుమతులు లభించాయి.

ఆధునిక టెక్నాలజీతో..

12 కి.మీ. బీటీ రహదారి నిర్మాణానికి ఆధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నట్లు సమాచారం. వ్యర్థ ప్లాస్టిక్‌తో పాటు సిమెంట్, కంకరను వినియోగించి రహదారి నిర్మించనున్నారు. బొగ్గేరుపై కి.మీ. దూరం కాజ్‌వే నిర్మాణం చేయనున్నారు.

దశాబ్దాల సమస్య



వెన్నవాడ-గండ్లవీడు మధ్యలో బొగ్గేరు మీదుగా రాకపోకలు సాగించేందుకు తరతరాలుగా ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఆత్మకూరు ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించిన అనేక మందికి మొర పెట్టుకున్నాం. దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి బొగ్గేరుపై కాజ్‌వే నిర్మిస్తామని మాకు హామీ ఇచ్చారు. ఆయన అకాల మరణంతో ప్రస్తుత ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మా కల నెరవేరుస్తున్నారు.

– మద్దినేని అప్పయ్యచౌదరి, గండ్లవేడు, ఆత్మకూరు మండలం

నెల రోజుల్లో శంకుస్థాపన చేయిస్తాం



రామస్వామిపల్లి-నల్లగొండ్ల రోడ్డు పునర్నిర్మాణంతో పాటు వెన్నవాడ-గండ్లవీడు మధ్య బొగ్గేరుపై కాజ్‌వే నిర్మాణానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అవిశ్రాంతంగా కృషి చేశా రు. ఆయన ప్రయత్నం ఫలించింది. నెల రోజుల్లో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం ఖాయం.

– కొల్లి దొరస్వామినాయుడు, వైఎస్సార్‌సీపీ నేత, గండ్లవీడు, ఆత్మకూరు మండలం

కాజ్‌వే నిర్మాణం కష్టాలు తీరుతాయి



వింజమూరు, దుత్తలూరు, మర్రిపాడు, ఆత్మకూరు మండలాల మధ్య 30 గ్రామాల ప్రజలకు రాకపోకలు సాగించేందుకు బొగ్గేరు ఇబ్బందికరంగా ఉంది, వర్షాకాలంలో బొగ్గేరు వాగు ప్రవహించే ఆయా గ్రామాల ప్రజలు పది కిలో మీటర్లకుపైగా దూరం ప్రయాణించి గమ్యస్థానానికి చేరాల్సి ఉంది. ఒక కి.మీ.కాజ్‌వే నిర్మిస్తే ప్రజల రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయి.

– కోటంరెడ్డి పుల్లారెడ్డి, వెన్నవాడ, ఆత్మకూరు మండలం

పొగాకు రైతులు పడరానిపాట్లు



డీసీపల్లిలోని పొగాకు వేలం కేంద్రానికి నిత్యం ఉత్పత్తుల విక్రయానికి వందలాది రైతులు రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డు ధ్వంసమైపోవడంతో ట్రాక్టర్లలో పొగాకు బేళ్లు వేలం కేంద్రానికి తరలించడం చాలా ఇబ్బందికరంగా మారింది. మాది దశాబ్దాల సమస్య. ఈ సమస్యకు పరిష్కారం చూపుతున్న ఎమ్మెల్యేకు 30 గ్రామాల ప్రజలు రుణపడి ఉంటారు.

– గుంటక శ్రీరాములు రెడ్డి, రామస్వామిపల్లి, ఆత్మకూరు మండలం

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



నెల్లూరులోని పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు విజయలక్ష్మి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని 23వ వార్డు పేరారెడ్డిపల్లి సచివాలయం పరిధికి చెందిన వల్లెపు వెంకటయ్య (బసవయ్య) ఇటీవల అనారోగ్యంతో నెల్లూరులోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అతనికి వృద్ధాప్య పింఛన్ ఇచ్చేందుకు వలంటీరు విజయలక్ష్మి శనివారం నెల్లూరుకు వెళ్లి ఆస్పత్రిలో బెడ్‌పై చికిత్స పొందుతున్న వెంకటయ్యకు పింఛన్ అందజేయడంతో ఆయన బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ పనితీరు భేషుగ్గా ఉందని ప్రశంసించారు.

ప్రమాదకర ప్రదేశాలు పరిశీలించిన ఎస్సై



కదిరినాయుడుపల్లి వద్ద కేతామన్నేరుపై నిర్మించిన బ్రిడ్జి సమీపంలో ప్రమాదకర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్సై విశ్వనాథరెడ్డి

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలంలోని బూదవాడ, కృష్ణాపురం, సింగనపల్లి, కదిరినాయుడుపల్లి, తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారిపై ప్రమాదకర ప్రాంతాలను మర్రిపాడు ఎస్సై విశ్వనాథరెడ్డి శనివారం క్షేత్ర పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదకర ప్రాంతాల్లో తగు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం విస్తరించాలి

- రీజనల్ టెక్నికల్ కోఆర్డినేటర్ సీహెచ్ రవీంద్రప్రసాద్



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న రవీంద్రప్రసాద్

ఉదయగిరి: ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేపట్టేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని నెల్లూరు, తిరుపతి జిల్లాల రీజనల్ టెక్నికల్ కో-ఆర్డినేటర్ సీహెచ్ రవీంద్రప్రసాద్ సూచించారు. ఆయన శనివారం స్థానిక సచివాలయం-1 రైతుభరోసా కేంద్రంలో ఉదయగిరి డివిజన్ వ్యవసాయ సిబ్బందితో ప్రకృతి వ్యవసాయంపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో రైతులకు పెట్టుబడుల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు సాధించుకోవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం కింద సిబ్బంది సాగు చేయించిన పంటలు, పండించిన పద్ధతులు తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని అప్పసముద్రంలో రైతులు వెంకటేశ్వర్లు, వీరేంద్ర సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామ్మోహన్, సురేష్, సుధారాణి, రోహిణి, లక్ష్మయ్య, బాజిరెడ్డి, కిరణ్, కిషోర్, రాజేశ్వరి పాల్గొన్నారు.

బిడ్డకు అమ్మపాలు అమృతం

కావలి: డాక్టర్ రామ్ సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో అంగనవాడీ కేంద్రాలు ఇస్లాంపేట, గాయిత్రీనగర్, జొన్నాయిగుంట సంయుక్త కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. డాక్టర్ రామ్ సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ శిశువు జన్మించిన గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల దేశంలో ఏడాదికి రెండున్నర లక్షల మంది చిన్నారుల ప్రాణాలు కాపాడవచ్చని వైద్యులు తేల్చి చెబున్నారన్నారు. డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, ఎం.మాలకొండారెడ్డి, 2, 3, 4 సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు కల్పన, పవనకుమారి, శైలజ, అంగనవాడీ టీచర్లు మంజుల, అరుణ, శ్యామల పాల్గొన్నారు.

వరికుంటపాడు: తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగిస్తాయని ఉదయగిరి అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారిణి పచ్చవ లావణ్య అన్నారు. ఆమె శనివారం మండలంలోని పెద్దిరెడ్డిపల్లి సెక్టారు పరిధిలోని మహ్మదాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తలు నిర్వహించారు. సూపర్‌వైజర్ జేవీఎస్‌ఆర్ కళావతి, సెక్టారులోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాల ఆవశ్యకతను గుర్తించండి

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలంలోని గొల్లపల్లి సెక్టార్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ మాట్లాడుతూ తల్లిపాలు సమృద్ధిగా వచ్చేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని, బాలింతలకు సైతం కావాల్సిన మేర పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం ఆర్ వెంకటకృష్ణారెడ్డి, అంగన్‌వాడీ సిబ్బంది పి.పద్మ, బీవీ కుమారి, యు సునీత, బి షహనాభాను, పి తిరుపతమ్మ, ఆశ వలంటీరు కావేరి పాల్గొన్నారు.

ఉదయగిరి: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టమని, బిడ్డ పుట్టిన అరగంటలోపు ముర్రుపాలు తాగిస్తే వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పలు అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. శనివారం మండలంలోని బిజ్జంపల్లి అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాల్లో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కలిగించి పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎం.అనూరాధ, మహిళా సంరక్షణ కార్యదర్శి షబియా, అంగన్‌వాడీ కార్యకర్త సౌభాగ్యలక్ష్మి, ఏఎన్‌యం దేవి, ఆశ వలంటీరు హజరత్తమ్మ పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి): బిడ్డ పుట్టిన ఆర్నెళ్ల వరకు తల్లి పాలు ఇవ్వడం ఎంతో శ్రేయస్కరమని, ప్రతి తల్లికి అవగహన కల్పించాలని ప్రముఖ జిల్లా పిల్లల వైద్యు నిపుణులు మాశిలామణి అన్నారు. వింజమూరులో శనివారం తల్లిపాల వారోత్సవల్లో భాగంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా నరాల, మెదడు, కన్ను సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో మెడికోవర్ వైద్యశాల గుండె వ్యాధి నిపుణులు గంగాధర్, ఉదయగిరి సీహెచ్‌సీ హెడ్ నర్స్ పలువురు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్టకరమని ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. శనివారం అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న తల్లిపాల వారోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన ప్రతి చిన్నారికి తల్లిపాలు తాగించాలని, డబ్బా పాలు తాగించవద్దని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ జ్యోతి, డాక్టర్ మంజుల, అంగన్‌వాడీ ఆయాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్నం భోజనం ఆకస్మిక తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న కమిషనర్, ఎంఈఓలు

కావలి: పట్టణంలోని పాతూరులో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, ఎంఈఓలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనానికి విద్యార్థుల హాజరు సంఖ్య 57 శాతం మాత్రమే ఉందన్నారు. వారం రోజుల్లో ఈ సంఖ్యను 90 శాతానికి చేరుకోవాలన్నారు. ఎంఈఓ గోవిందయ్య మాట్లాడుతూ విద్యార్థులకు మధ్యాహ్నం భోజనంలో ప్రభుత్వం అన్ని రకాల బలవర్ధకమైన పదార్థాలు, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తోందని చెప్పారు.


అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత



డీవార్మింగ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉదయగిరి: మండలంలో అభివృద్ధి, సంక్షేమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీపీ మూలె పద్మజ, జెడ్పీటీసీ మోది రామాంజనేయులు తెలిపారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో మండల సర్వసభ్య స మావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ప్రభు త్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అధికారులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పలువురు సర్పంచ్‌లు స్థానికంగా నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులు త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఈ నెల 10న జరిగే డీవార్మింగ్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్, మండల కోఆప్షన్ సభ్యుడు సుబాని, వైస్ ఎంపీపీ మట్ల శాంతి, సొసైటీ మాజీ అధ్యక్షుడు వినయ్‌రెడ్డి, తహసీల్దార్ జగదీష్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లి కార్జునరావు, ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి, ఏఓ రేణుక, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర రాష్ట్ర పరేడ్‌కు కావలి ఎన్‌సీసీ విద్యార్థి



కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో మూడో ఏడాది బీఎస్సీ చదువుతున్న వై. బాలాజీ ఈ నెల 15వ తేదీ విజయవాడలో జరిగే స్వాతంత్య్ర దినోత్సవ వేడకల్లో జరిగే పరేడ్‌లో పాల్గొనున్నారు. కళాశాలకు సమాచారం అందింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థికి పాల్గొనే అవకాశం రావడం సంతోషమని కళాశాల రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వి.సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజగోపాల్‌రెడ్డి, ఎన్‌సీసీ అధికారి కిరణ్‌కుమార్, పీడీలు మాల్యాద్రి, ప్రసాద్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

రక్తగ్రూప్ నిర్ధారణ పరీక్షలు

కావలి: ప్రతి ఒక్కరూ తమ రక్తగ్రూప్‌ను తెలుసుకుని ఉండాలని స్థానిక వెంగళరావునగర్‌లో ఉన్న పొట్టి శ్రీరాములు పురపాలక ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం పాఠశాలలోని ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు నెల్లూర్ రెడ్‌క్రాస్ వైద్య సిబ్బంది బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ తిప్పిరెడ్డి కొండారెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ సేవల్లో ముందు ఉంటుందని కొనియాడారు. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర, జీవశాస్త్ర అధ్యాపకుడు అంజాద్‌అలీ పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను ఆశీర్వదించండి



చామదలలో మేకపాటి రాజారెడ్డికి హారతులు పడుతున్న మహిళలు

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి

జలదంకి: రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా ఉండి మరోసారి ఆశీర్వదించాలని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి అన్నారు. శనివారం చామదల, వేణుగోపాలపురం, ఆదిరెడ్డిపాళెం గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజారెడ్డి అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందించారు. స్థానికులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు నిర్మించాలని రాజారెడ్డి దృష్టికి తెచ్చారు. తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. రాజారెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకోవడం, వారి కుటుంబాల్లో సంతోషం నింపడం మే ముఖ్యమంత్రికి తెలిసిన రాజకీయమన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రంలో పాలన సాగుతుందన్నారు. ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలు కుట్రలతో అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. రాబో యే ఎన్నికల్లో టీడీపీ గల్లంతు కావడం ఖాయమని తెలిపారు. ఎల్లో మీడియా, చంద్రబాబు, దత్తపుత్రుడు, లోకేష్ ఎన్నిసార్లు దండాలు పెట్టినా, ఎన్ని హామీలు గుప్పించినా అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని జోస్యం చెప్పారు. సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పార్టీలకతీతంగా అర్హులందరి గడపకు చేరుతున్నాయన్నారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ద్వారా చామదల పంచాయతీలో అర్హులైన దాదాపు 70 మంది వరకు ఏడాదికి రూ. 24 వేలు అందజేస్తూ చేనేత కార్మికులను ఆదుకున్న ఏకైక ప్రభు త్వం తమదేనన్నారు. మీ ఇంటిలో మీకు జగనన్న మంచి చేశాడని భావిస్తే ఆయన్ను మరోసారి ఆశీర్వ దించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చేవూరు జనార్దన్ రెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, ఎంపీటీసీలు పసుపులేటి అమరావతి, దేవరపల్లి విజయ్‌రెడ్డి, సర్పంచ్ పలుకూ రి సీతారావమ్మ, నాయకులు గుర్రం జగ్గయ్య, తమ్మి నేని సతీష్, పులిమి బాబుల్‌రెడ్డి, వంటేరు లక్ష్మీనరసారెడ్డి, పసుపులేటి ప్రసాద్, వంటేరు చిన లక్ష్మీనరసారెడ్డి, కోటా కోటిరెడ్డి, సోము ఎరుకలరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాణం విలువ తెలుసుకోండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాములు

సంగం: ప్రాణం ఎంతో విలువైందని, పోతే తిరిగి రాదని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలతో పాటు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు చెప్పారు. సంగంలోని సాయిరాం జూనియర్ కళాశాలలో శనివారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తప్పనిసరిగా రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఇటీవల రోడ్డు ప్రమాదాల్లో కొందరు యువకులు మృతి చెందారన్నారు. కారులో ప్రయాణించేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా వేసుకోవాలని, ప్రధానంగా స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మిక సంఘాల్లో ఏఐటీయూసీ ప్రముఖ పాత్ర

ఆత్మకూరు: దేశంలో స్వాతంత్రం రాకముందే ఏర్పడిన ఏఐటీయూసీ కార్మిక సంస్థ ప్రాముఖ్యత కలిగిందని అనేక పార్టీల కార్మిక సంఘాలకు ఇది తల్లివంటిదని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎం వెంకయ్య అన్నారు. పట్టణంలోని శ్రీధర్ గార్డెన్స్‌లో రెండు రోజులుగా జరుగుతున్న పార్టీ రాజకీయ శిక్షణా తరగతుల్లో వెంకయ్య మాట్లాడారు. ప్రజా సంఘాల కూటమి, కార్మికుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కరింపబడతాయని, దీనికి సీపీఐ దేశ వ్యాప్తంగా ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజశేఖర్, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, ఆత్మకూరు నాయకులు యామాల మధు, జిల్లా రైతు సంఘం నాయకుడు షేక్ షానవాజ్, బలిజేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.